జెట్టీ నిర్మాణం కలేనా!

- ప్రతిపాదనలకే పరిమితం
- మరో వైపు కాలుష్య బెడద
- అవస్థలు పడుతున్న మత్స్యకారులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో జెట్టీ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. ఫలితంగా కనీస వసతులు లేక మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. జెట్టీ నిర్మాణం దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని ముత్యాలమ్మపాలెం పరిసర గ్రామాల్లో 9 వేల మంది గంగపుత్రులు చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. దిబ్బపాలెం, జాలరిపేట, తిక్కవానిపాలెం మత్స్యకార గ్రామాల్లో సుమారు 120 పడవలు చేపల వేట సాగిస్తున్నాయి. ఒక్కొక్క పడవకు 6 గురు చొప్పున సుమారు 720 మంది మత్స్యకారులు చేపల వేటలో పాల్గొని వేట సాగిస్తారు. చేపల వేట ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. తీరంలో జెట్టీ ఏర్పాటు చేయాలని మొరపెట్టుకున్నా ఏ ప్రభుత్వం తమ గోడు వినలేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరంలో జెట్టీ లేక పడవలను తీరంలో నిలపడంతో విపత్తుల సమయంలో పడవలు సముద్రంలోకి కొట్టుకుపోయి తీవ్ర నష్టాల పాలవుతున్నామని వాపోతున్నారు.


జెట్టీ లేక ఇసుక తిన్నెలపై నిలిపిన పడవలు

కాలుష్య బెడద

జెట్టీ సమస్యతో పాటు ఫార్మా వ్యర్థ రసాయనాలు తమ పొట్టకొడుతున్నాయని మత్స్యకార్మికులు చెబుతున్నారు. ఫార్మా వ్యర్థ రసాయనాలు సముద్ర జలాల్లో కలవడంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 20 ఏళ్ల కిందట వరకు చేపల వేటకు వెళితే భారీ మొత్తంలో చేపలు వలలకు చిక్కేవని.. ప్రస్తుతం ఫార్మా పరిశ్రమలు రాకతో వ్యర్థ రసాయనాలు సముద్ర జలాల్లో కలవడం వల్ల మత్స్య సంపద వలలకు చిక్కడం లేదంటున్నారు. చేపల వేట సాగని గంగపుత్రులకు ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీలు కూడా పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదని ఆవేదన చెందుతున్నారు.

కానరాని ఉపాధి

ఉపాధి అవకాశాల కోసం 2012లో మత్స్యకార్మికులు ఆమరణ నిరహార దీక్షకు దిగారు. అప్పట్లో మత్స్యకార గ్రామాల్లోని యువతకు 500 ఉద్యోగాలు కల్పిస్తామని అధికారులు ఇచ్చిన హామీ ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదని గంగపుత్రులు ఆరోపిస్తున్నారు.


ముత్యాలమ్మపాలెం తీరంలో జెట్టీ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

జెట్టీ నిర్మించాలి



నేను జాలరి పేటలో నివసిస్తున్నాను. నాతో పాటు మరో ఐదు మంది పడవపై చేపల వేట సాగిస్తాం. వేట నుంచి ఒడ్డుకు చేరిన పడవలకు తీరంలో రక్షణ లేకుండా పోయింది. తుపాన్లకు పడవలు కొట్టుకుపోతున్నాయి. తీరంలో జెట్టీ ఏర్పాటు చేస్తామని నాయకులు హామీ ఇస్తున్నారే తప్పా కార్యరూపం దాల్చడం లేదు. దీంతో వేట సామగ్రికి భద్రత లేక తుఫాన్ల సమయంలో నష్టపోతున్నాం.

– కంబాల దేముడు, జాలరిపేట

ఉపాధి కోసం ఎదురు చూపులు



చేపల వేటను నమ్ముకొని మా కుటుంబాలు కాలం వెళ్లదీస్తున్నాం. చేపల వేట సాగకపోతే కుటుంబాలు పస్తులుండాల్సిందే. ఫార్మా, ఎన్టీపీసీ పరిశ్రమల వల్ల సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద తగ్గిపోయింది. ఫలితంగా వలలకు చేపలు చిక్కడం లేదు. సముద్రంపై వేటకు వెళ్లిన ఒక్కొక్క సమయంలో చేపలు చిక్కక రిక్త హస్తాలతో తిరిగి వస్తున్నాం. జీవనోపాధి కష్టంగా ఉంటుంది. ఉపాధి కల్పన కోసం గతంలో మేము ఆందోళన చేశాం. అప్పట్లో అధికారులు ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నాం.

– చింతకాయల ముత్యాలు, మత్స్యకారుడు, ముత్యాలమ్మపాలెం

క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ


విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సామగ్రి అందిస్తున్న నారాయణరావు, దాతలు

పెందుర్తి: మండలంలోని రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామంలో నివాసం ఉంటున్న వెన్నెల అప్పలనాయుడు, వెన్నెల ఎర్రినాయుడు స్టేషనరీ సమకూర్చారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ రూ.20 వేలు విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి అందించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు చేతుల మీదుగా ఆయా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్, మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం రామసత్యం, ఉపాధ్యాయులు కె.వి. రమణ, డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


వైజయంతి

పెందుర్తి: వేపగుంటకు చెందిన గంగా వైజయంతి(22) అనే యువతి అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిగ్రీ చదువుకుని ఇంట్లో ఉంటున్న వైజయంతి గత నెల 30న ఎవరికీ చెప్పకుండాబయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి హెచ్‌సీ ప్రకాష్ దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా నిత్య కల్యాణం


స్వామికి నిత్య కల్యాణం జరిపిస్తున్న, నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అప్రమత్తతతో సైబర్ నేరాలకు చెక్

క్రైం ఏసీపీ శ్యామలరావు


మాట్లాడుతున్న క్రైం ఏసీపీ శ్యామలరావు

పెందుర్తి: ప్రస్తుతం సాంకేతికతను వినియోగించుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జోన్-2 క్రైం విభాగం ఏసీపీ శ్యామలరావు అన్నారు. ఆర్ఆర్ వెంకటాపురం సమీపంలోని ఆళ్వార్‌దాస్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులంతా సైబర్ నేరాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్ వచ్చినా.. బ్యాంకు ఖాతా, ఇతర వివరాలు అడిగినా తెలియజేయవద్దన్నారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం, రవాణా జీవితాలను నాశనం చేస్తుందన్నారు. సమాజంలో గుర్తింపు కావాలంటే చక్కటి నడవడిక అవసరమని చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను అలవోకగా చేరుకుంటారని పేర్కొన్నారు. వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డితో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ


వైవీ సుబ్బారెడ్డితో గండి రవి, ముమ్మన దేముడు

పెందుర్తి: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మంగళవారం వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ సబ్బవరం మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, మొగలిపురం సర్పంచ్ సిరపరపు వాసు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈపూజలు నిర్వహించారు.

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ పోషకాలు


మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

సబ్బవరం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ పోషకాలు అందుతాయని ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి అన్నారు.మహిళా శిశు సంక్షేమ శాఖ,వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో మంగళవారం సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక మూడు రోడ్ల కూడలి వరకూ భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను, పోషకాలను తెలియజేసే విధంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.అనంతరం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. సీడీపీవో లలిత కుమారి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి కనీసం ఆర్నెల్ల పాటు తల్లి పాలు పెట్టాలన్నారు. దీని వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి, మేధాశక్తి పెంపొందుతుందని చెప్పారు.పిల్లలకు రెండేళ్లు నిండే వరకూ తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనరావు,ఈవోఆర్డీ మహేష్, ఏవో షేక్ బాబూరావు, సీహెచ్‌వో స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు,అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక మంగళగౌరీ వ్రతాలు


మంగళగౌరీదేవి


సామూహిక మంగళ గౌరీ వ్రతాలను ఆచరిస్తున్న మహిళలు

సింహాచలం: శ్రావణ మంగళవారం పురస్కరించుకుని అడవివరంలోని గౌరీ కల్యాణ మండపంలో సామూహిక మంగళ గౌరీ వ్రతాలు ఘనంగా జరిగాయి. 108 మంది మహిళలు వ్రతాలను ఆచరించారు. వేదికపై శ్రావణ మంగళగౌరీదేవి విగ్రహాన్ని అధిష్టింపజేసి విఘ్నేశ్వరపూజ, షోడషోపచారపూజలు నిర్వహించారు.

అనంతరం పంచామృతాభిషేకం నిర్వహించారు. గౌరీ కల్యాణమండపం నిర్వాహకులు ఆళ్ల అప్పలనాయుడు, సూరిశెట్టి అచ్యుతరాము, ఆళ్ల జగన్నాథరావు,భీశెట్టి ఈశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గెడ్డవాగు ఆక్రమణకు బ్రేక్


గెడ్డవాగులో ఏర్పాటు చేసిన రోడ్డును తవ్విస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ గెడ్డవాగు ఆక్రమణలకు రెవెన్యూ అధికారులు మంగళవారం అడ్డుకట్ట వేశారు.ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 103,106లలో గెడ్డవాగు కబ్జాకు గురైందని గ్రామస్తులు పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ వీరయ్య మిగిలిన సిబ్బందితో కలిసి వాగులో అక్రమంగా నిర్మించిన రోడ్డును పొక్లెయిన్ సాయంతో తవ్వించేశారు. రాకపోకలు నిలుపుదల చేశారు. కాగా అక్రమంగా రోడ్డు ఏర్పాటు చేసిన కొంతమంది రెవెన్యూ సిబ్బందిపై ఎదురు తిరిగి వీరంగం సృష్టించారు. ఇంతలో పోలీసులు రంగప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ఆక్రమణకు గురైన గెడ్డవాగులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

తహసీల్దార్‌కు అభినందన


పెందుర్తి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.వేణుగోపాల్‌ను జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. పలు అంశాలపై మాట్లాడారు.

– పెందుర్తి

శభాష్


ధర్మారాయుడుపేట కూడలిలో గుంతలు పూడ్చుతున్న యువత

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో రావాడ శివారు ధర్మారాయుడుపేట కూడలిలో ఏర్పడిన భారీ గుంతలను స్థానిక యువత శ్రమదానంతో మంగళవారం పూడ్చారు. గుంతలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువకులు ముందుకు వచ్చి గుంతలు పూడ్చడానికి చర్యలు చేపట్టారు. భారీ గుంతలను గ్రావెల్, మట్టితో పూడ్చి తమ మానవతా ధర్మాన్ని చాటారు. శ్రమదానం చేసిన యువతను పలువురు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.51,116 విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న పోతంశెట్టి శేషు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో పునర్నిర్మాణంలో ఉన్న శివాలయానికి గొటివాడ గ్రామానికి చెందిన పోతంశెట్టి శేషు రూ.51,116 అందించారు.ఈ విరాళం మొత్తాన్ని ఆయన ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో దంగేటి నానిబాబు,దంగేటి ప్రకాశ్,గెడ్డం కృష్ణ,కోరాడ శ్రీను, కొల్లి కృష్ణ,చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెడు మార్గంతో భవిత అంధకారం


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ అసిరితాత

పెందుర్తి: జీవితంలో టీనేజ్ కీలక దశ.. ఈ సమయంలో పట్టుదలతో ముందుకు సాగాలి..చెడు మార్గాల వైపు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని పెందుర్తి లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేటికాలంలో యువత డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలను అలవాటు చేసుకుని జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితిలో చెడు మార్గాల వైపు వెళ్లవద్దని..వెళితే జైలుపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఉపాధి కల్పిస్తామని హామీ


శ్రావణికి న్యాయం చేయాలని ఫోన్ ద్వారా తహసీల్దార్‌కు సూచిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: భర్తను కోల్పోయిన తాను అత్తవారింటిలో నిరాదరణకు గురైన తనకు ఉపాధి కల్పించాలని పెందుర్తి ఎస్ఆర్ పురానికి చెందిన శ్రావణి అనే మహిళ విన్నవించుకుంది. అమరావతిలోని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది.

వివరాలు.. నెల్లూరు ప్రాంతానికి చెందిన శ్రావణి భర్త ఏడాది కిందట మరణించాడు. దీంతో పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలో నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చిన శ్రావణి స్థానికంగా నివాసం ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం శ్రావణి పరిస్థితిని క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. అనంతరం ఆమెకు వితంతు పింఛన్, ఇంటి స్థలంతో పాటు ఔట్ సోర్సింగ్ ద్వారా ఉపాధి కల్పించాలని తహసీల్దార్ కె.వేణుగోపాల్‌కు ఎమ్మెల్యే రమేష్‌బాబు సూచించారు.

నిరంతర సాధనతో రాణింపు


ప్రిన్సిపాల్ నారాయణరావును సత్కరిస్తున్న చంద్రశేఖర్

పెందుర్తి: సాంకేతిక రంగంలో రాణించాలంటే నిరంతర సాధన అవసరమని జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఐవోటీ–సెన్సార్స్' అంశాలపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెసెస్స సంస్థ ప్రతినిధి టి.సూర్యస్వరూప్, ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.నాగమణి, అధ్యాపకులు బి.శేషసాయి, వీఆర్ఎల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను ప్రోత్సహించాలి


వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న ఎన్ఐఆర్‌వో ప్రతినిధి నాగరాజు

పెందుర్తి: మండలంలోని ఎస్ఆర్‌పురంలో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎన్ఐఆర్‌వో) ప్రతినిధి కె.నాగరాజు మంగళవారం పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అందులో తయారవుతున్న వర్మీ కంపోస్ట్‌ను వినియోగించుకుంటున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ, అమల్లో అన్ని విభాగాల సమన్వయం అవసరమని చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దీపిక, అధికారులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల నుంచి ప్రాణహాని

- మా భూములు లాక్కునేందుకు యత్నం
- తప్పుడు కేసుల్లో ఇరికించి భయపెడుతున్నారు
- చింతగట్ల మాజీ సర్పంచ్ మాడిస ఉప్మాక


మాట్లాడుతున్న ఉప్మాక, దేముడమ్మ

పెందుర్తి: కోర్టు వివాదంలో ఉన్న తమ భూమిలోకి చొరబడడమే కాకుండా కూటమి నాయకులు చంపేస్తామని బెదిరిస్తున్నారని చింతగట్ల మాజీ సర్పంచ్ మాడిస ఉప్మాక, ఆమె భర్త పైడిరాజు ఆరోపించారు. మంగళవారం చింతగట్లలో వారు విలేకరులతో మాట్లాడారు. వారసత్వంగా వచ్చిన భూమికి సంబంధించి 2020లో గ్రామ పెద్దల సమక్షంలో పత్రాలు రాయించుకున్నామన్నారు. అయితే కొద్దిరోజుల తర్వాత కుటుంబ తగాదాల కారణంగా ఆ భూమి కోర్టు కేసులోకి వెళ్లిందన్నారు. అప్పటి నుంచి దాదాపు నాలుగేళ్లుగా వివాదంలో ఉన్న భూమిలోకి ఎవరూ వెళ్లలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ భూముల గొడవకు రాజకీయ రంగు పులిమారని వాపోయారు.ఎమ్మెల్యే, ప్రభుత్వం పేరు చెప్పుకుని తమపై దాడి చేయడమే కాకుండా అక్రమ కేసులు పెట్టి ఇరికించారని ఆరోపించారు. గట్టిగా అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయారు.తమ భూములు లాక్కోవడానికి యత్నిస్తున్నారన్నారు.

గత శుక్రవారం తన బావ కొడుకు, జనసేన నాయకుడు హరీష్, అతని తల్లిదండ్రులు వివాదంలో ఉన్న భూమిలోకి చొరబడి దుక్కి దున్నిస్తుండగా వెళ్లి అడ్డుకుంటే దాడి చేసి గాయపరిచారని ఉప్మాక చెప్పారు. గొడవలో తన కుమారుడు, దేముడమ్మ, ఆమె కుమారుడు కనీసం గ్రామంలో కూడా లేరని వివరించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తమకు తెలుసని.. మేం ఏం చెబితే అది జరుగుతుందని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గ్రామంలోని టీడీపీ నాయకుడు చిన్నారావు, ఇతర టీడీపీ, జనసేన నాయకుల నుంచి తమకు ప్రాణహాని ఉందని ఉప్మాక ఆందోళన వ్యక్తం చేశారు. తమకు జరుగుతున్న అన్యాయంపై త్వరలో ఎమ్మెల్యే రమేష్‌బాబును, ఇతర ప్రభుత్వ పెద్దలను కలిసి వివరిస్తామని..వారే తగిన న్యాయం చేయాలని ఆమె విన్నవించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి:పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 63 మందిని రెండో ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రూ.1,38,000 జరిమానా విధించారు.